www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 25 ఆగస్టు 2023

5

తిరుపతి

ద్రౌపతి దేవి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం పట్టు వస్త్రాలు

పుత్తూరు టౌన్ : పట్టణంలోని శ్రీ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజుల దేవస్థానం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం బజారు వీధిలోని వినాయకుడి గుడి నుండి శ్రీశైలం దేవస్థాన చైర్మన్ రెడ్డి వారి,చక్రపాణి రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు డిఎన్ఏలుమలై దంపతులు (అమ్ములు), ఆధ్వర్యంలో ద్రౌపతి దేవికి పట్టు వస్త్రాలు ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి రాజు, శేఖర్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి : సిపిఎం

కుక్కంబాకం భూసమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాకం రెవెన్యూలోని భూ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు విజ్ఞప్తి చేశారు. సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దార్ భార్గవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిని స్థానికేతరులు కబ్జా చేయాలని చూస్తున్నారని విమర్శించారు .స్థానిక దళితులు, బీసీలకు ఆ భూమి చెందే విధంగా న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా సర్వే నెంబరు 301/8(ఎ)లో ఒకటిన్నర ఎకరా డీకేటి భూమి 1995లో బర్రా వెంకటసుబ్బమ్మ వైఫ్ ఆఫ్ కష్ణయ్య పేరుతో పట్టా ఇచ్చారని, దానికి ఈ బుక్కులతో సహా ఉన్నాయని, ఆ బుర్ర వెంకట సుబ్బమ్మ చనిపోయిన తర్వాత కుమారుడైన బుర్ర వేణు పేరుతో పాసు బుక్కులు ఆన్లైన్లో నమోదు చేసుకుని రైతు భరోసా, పిఎం కిసాన్, అగ్రికల్చర్ లోన్‌కు సంబంధించి అన్ని ఆధారాలూ ఉన్నాయన్నారు. అయితే స్థానికేతరుడైన తెల్లాకుల చెంగలరాయిశెట్టి కుమారుడు తెల్లఆకుల వేణుగోపాల్ శెట్టి ఈ భూమి తనదని దౌర్జన్యం చేస్తూ దళితుడైన వేణుని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖను ఆశ్రయించినా పట్టించుకోవడం లేదన్నారు. వేణు కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా భూమిలోకి వెళ్లేందుకు పెత్తందారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తహశీల్దార్ భార్గవి స్పందిస్తూ స్థానికేతరులకు ఎలాంటి పట్టాలు ఇవ్వకపోయినా కోర్టు ద్వారా స్టేటస్‌కో ఆర్డర్ తెచ్చారని, సదరు ఆర్డర్‌పై రెవెన్యూ రికార్డుల పరంగా వారికి ఎలాంటి హక్కులూ లేవని కోర్టుకు తెలియజేసి తదుపరి కోర్టు ఉత్తర్వుల మేరకు పేదలకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమణయ్య, తిరుపాలు, చిన్న గురవయ్య, జెకె రమణయ్య, కుక్కంబాకం గ్రామస్తులు పాల్గొన్నారు.

కుమార్ మృతిపై విచారిస్తున్న సిపిఎం బృందం

కుమార్ మృతిపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి -సత్యవేడు

రాసపాలెం గ్రామంలో అనుమానాస్పదంగా మృతిచెందిన కుమార్ మతిపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి.అరుణాచలం డిమాండ్‌చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కుమార్ మృతిపై నిజాన్ని నిగ్గు తేల్చాలని ఐదు రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తుంటే పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్‌లు మృతుని కుటుంబాన్ని సరామర్శించారు. జరిగిన విషయాలను కుమార్ భార్య గౌరి వివరించారు. అనంతరం శ్రీసిటీ డిఎస్‌పిని కలిసి కుమార్ హత్య కేసును త్వరగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. డిఎస్‌పి స్పందిస్తూ సమగ్ర విచారణ జరిపి దళిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల కార్యదర్శి ఎం.రమేష్, గ్రామస్తులు ఆదిశేషన్, వరాలు, శరవణన్ పాల్గొన్నారు.

దళిత ప్రజాసంఘాల నిరసన

దళితులు ప్రవేశించకుండా తాళం వేయడం సంప్రదాయమా..?

పుత్తూరు టౌన్ : రామకృష్ణాపురం పంచాయతీలోని గొల్లపల్లి ఆలయంలో దళితులు ప్రవేశించకుండా తాళం వేయడం సంప్రదాయమా? అని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వెంకటేష్, డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్ ప్రశ్నించారు. గురువారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పుత్తూరు తహశీల్దార్, డిఎస్‌పి, సిఐ సమక్షంలో వామపక్ష, దళితసంఘాల ఆధ్వర్యంలో ఆలయ ప్రవేశం చేశారన్నారు. గుడి ఆవరణలోనే ఒప్పంద పత్రాన్ని అగ్రకులాల వారు వ్యతిరేకించారని, సిఐ జోక్యం చేసుకుని రెండు రోజుల తరువాత ఒప్పందపాత్రాన్ని రాతపూర్వయంగా రాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించామన్నారు. తహశీల్దార్, సిఐ జోక్యం చేసుకుని ఒప్పంద పత్రం రాయించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. లేనిచో సెప్టెంబర్ 4న తహశీల్దార్‌కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. 28న సిఎం జగన్మోహన్‌రెడ్డిని నగరిలో కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వై.నందయ్య, ధనంజయులు, పి.కుప్పయ్య, భారతి, క్రిష్ణమ్మ, నాగభూషణమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై ఎందుకంత కక్ష : సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉన్నత చదువులు చదివినా ప్రభుత్వ కొలువులు రాక కుటుంబ పోషణ నిమిత్తం ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న స్వయం ఉపాధికారులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎందుకంత కక్షని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ప్రశ్నించారు. పాలక ప్రభుత్వాలపై ఆధారపడకపోవడమే వారు చేసిన నేరమా అంటూ ధ్వజమెత్తారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆ సంఘం అనుబంధ తిరుపతి జిల్లా ఆటో కార్మికుల యూనియన్ నాయకుల సమావేశం జరిగింది. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగాయని వాపోయారు. ఆటో రిపేర్లకే పెట్టుబడుల్లేని దుర్భర స్థితిలో కేంద్రం తీసుకొచ్చిన మోటారు వెహికల్ చట్టం 2019, జీవో నం.21 ప్రకారం పోలీస్, ఆర్టీవో అధికారులు అక్రమ జరిమానాలు, ఈ-చలాన్లు వేస్తూ ఆటో కార్మికుల జీవితాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జీవో నం.21ని రద్దు చేసేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27 న శ్రీకాళహస్తి సీఐటీయూ కార్యాలయంలో జరిగే ఆటో యూనియన్ కార్మికుల ప్రథమ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మురళి, కుమార్, వారీష్, ఉస్మాన్ బాషా, దుర్గ, అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెలివేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు ప్రారంభించిన ప్రజ్ఞ రోవర్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

ఇస్రో విజయవంతముగా చంద్రుని పైకి చేర్చిన చంద్రయాన్-3 మిషన్ తన పనిని ప్రారంభించింది. చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ తరువాత నాలుగు గంటలు గడిచిన అనంతరం ల్యాండర్ లోని ప్రజ్ఞ రోవర్ చంద్రుని ఉపరితలంపై దిగింది. రోవర్ చంద్రుని పై వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ పరిశోధనలు మొదలు పెట్టింది. 1969 లో నాసా ప్రయోగించిన అపోలో-11 రాకెట్ ద్వారా చంద్రునిపై దిగిన తొలి మానవుడుగా గుర్తింపు పొందిన నీల్ ఆర్మ్ స్టాంగ్ తన అడుగులను చంద్రునిపై ముద్ర వేసి ప్రపంచ దేశాలకు చూపించడం జరిగింది. 54 ఏళ్ళ సుదీర్ఘ కాలం తరువాత ఇప్పుడు అలాంటి గుర్తులను చంద్రునిపై

చంద్రునిపై ఇస్రో మూడు సింహాల గుర్తులు

వేయడానికి భారత్ సిద్ధమైంది. చంద్రునిపై దిగిన రోవర్ కు ఆరు చక్రాలు ఉన్నాయి. అందులో రెండు వైపుల మధ్యన ఇస్రో సింబల్ ను మన భారత దేశ నాలుగు తలలు సింహం చిహ్నం గుర్తులను అమర్చి ఉన్నారు. రోవర్ చంద్రుని పైన తిరిగే సమయంలో ఇస్రో సింబల్ తో పాటు నాలుగు సింహాల చిహ్నం గుర్తులు చంద్రుని నేలపై ముద్ర పడే విదంగా అమర్చడం జరిగింది. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ అడుగులు తరువాత చంద్రుని పైన మన గుర్తులే కనిపిస్తున్నాయి. ఇది కూడా భారత్ కు ఇస్రో తెచ్చిపెట్టిన చారిత్రాత్మక ఘట్టంగా చెప్పాలి.



బిఎన్ కండ్రిగ, రేణిగుంటలలో...

జాబిల్లిపై జయకేతనం.. విద్యార్థుల్లో ఉత్సాహం..!

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సష్టిస్తూ ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ -3 విజయవంతంతో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయ చిహ్నం చూపించారు. జయహో ఇస్రో.. జయహో భారత్ అంటూ ప్రపంచ దేశాలన్నీ మన దేశం వైపు చూస్తున్నాయని జాతీయ జెండాలు పట్టుకుని విజయోత్సాహం చేసుకున్నారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, వేణుగోపాల్, నాదెండ్ల మురళి, దాసు , లక్ష్మయ్య జగన్నాథం, మాధవీలత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో... బాలికల పాఠశాలలో చంద్రయాన్ -3 విజయోత్సవ సభ విద్య వికాస వేదిక ఆధ్వర్యంలో జరిగింది. ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. సైన్స్ మాస్టర్ బ్రహ్మం మాట్లాడుతూ అమ్మాయిలు తన సృజనను పెంచుకుని వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. వికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ అరవై సంవత్సరాల ఇస్రో అంతరిక్ష సంగతులను వివరించారు. విక్రమ్ సారాభాయి నుండి నేటి సోమ్ నాథ్ వరకు, ఆర్యబట్ట భాస్కరా, మంగళయాన్, చంద్రయాన్ - 3 దాక జరిగిన పరిణామక్రమం విజయాల భవిష్యత్తు ప్రపంచనికి సందేశం ఇవ్వనున్నదని భూతాపం రక్షణకు ఒకమార్గం చూపగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు శ్రీదేవి, స్వప్న, ఉషా ప్రసంగించారు.

షటిల్ పోటీలను విజయవంతం చేయండి : చేవూరు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని హెచ్ డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైజీఎస్బీఏ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదకొండేళ్లుగా వైజీఎస్బీఏ ఎంతో మంది జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిందన్నారు. గూడూరుకు చెందిన గౌస్ జాతీయ స్థాయిలో సీనియర్స్ ర్యాంకింగ్స్ లో 3వ ర్యాంక్ లో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎంతోమంది కోచ్ లుగా స్థిరపడ్డారన్నారు. వైజీఎస్బీఏ గౌరవ సలహాదారు సోమిశెట్టి చెంచురామయ్య మాట్లాడుతూ చేవూరు విజయ్ మోహన్ మార్గదర్శకంలో జమాల్, గిరి, కలామ్ సంస్థను ముందుకు తీసుకెళుతున్నారని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్. జమాలుల్లా మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి షటిల్ పోటీలు అండర్ 15 బాలురు, బాలికల విభాగం, మెన్స్ డబుల్స్, ప్లస్ 42, తీన్ మార్ తదితర విభాగాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు 25వేల రూపాయలకు పైగా నగదు బహుమతులు, షీల్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైజీఎస్బీఏ సభ్యులు సోమిశెట్టి చెంచురామయ్య, ఉపాధ్యక్షుడు షేక్. అబ్దుల్ కలాం, ప్రధాన కార్యదర్శి గాధంశెట్టి గిరిబాబు, కార్యదర్శులు వల్లూరు రమేష్, కోదండపాణి, పీఆర్ గ్రానైట్ ప్రభాకర్, మల్లికార్జున్ రావు, సభ్యులు ఇంతియాజ్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పాదయాత్ర

వెంకటగిరి : ఐక్యత విజయపథం పాదయాత్ర అధినేత, రిటైర్డ్ ఐఎఎస్ విజయ్‌కుమార్ మండలంలోని జింకల బంగ్లా ఎస్టీ కాలనీలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 16 రోజులుగా పాదయాత్ర చేస్తున్నామని, సోమవారం కలపాడు గ్రామంలో పాదయాత్రను పున్ణప్రారంభించామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తాత్కాలిక ప్రయోజనాలే ప్రజలకు దక్కుతున్నాయన్నారు. 23 జిల్లాల్లోనూ ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ పాదయాత్రలో రాజారెడ్డి అనుచరుడు వెంకటసుబ్బయ్య సంఘీభావంగా పాల్గొన్నారు.

ఫాంటసీ చిత్రాలంటే ఇష్టం

మిస్టర్ పోలిశెట్టి హీరో నవీన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జగదేకవీరుడు అతిలోకసుందరి , ఆదిత్య 369 లాంటి చిత్రాలంటే తనకెంతో ఇష్టమని అలాంటి అవకాశం వస్తే తాను నటించడానికి సిద్ధంగా ఉన్నానని , జాతి రత్నాలు. , ఆత్రేయపురం లాంటి హిట్ చిత్రాలలో నటించిన పోలిశెట్టి నవీన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఓ ప్రైవేటు హోటల్లో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా తిరుపతికి విచ్చేసిన నవీన్ అభిమానుల మధ్య మీడియాతో మాట్లాడుతూ. కరోనా సమయంలో అతి కష్టం మీద సినిమాలు పూర్తిచేసి నేడు అభిమానుల ఆదరణ పొందుతున్నానన్నారు ఒక చిత్రాన్ని పూర్తి చేసిన తరువాత మరో కొత్త చిత్ర యూనిట్కు పూర్తి భరోసా కల్పించి నటిస్తున్నానన్నారు. అభిమానులకు ఇంటర్వ్యూ ఇస్తూ ప్రతి ఫ్యాన్ ను వారి ఇంటి పేరు తెలుసుకొని , జోకులు వేస్తూ రసవత్తరమైన మాటలతో ఫ్యాన్స్ ఫాలోయింగ్ పెంచుకుంటూ సెల్ఫీ లిస్తూ అందరిని ఆకట్టుకున్నాడు హీరో పోలి శెట్టి నవీన్. ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీ , బిగ్ సి థియేటర్లలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకుంటానని తెలియజేశారు.

ప్రజా జీవిత సారమే 'ఆముక్తమాల్యద'

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖ యస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించిన "ఆచార్య కె సర్వోత్తమరావు ధర్మనిధి ఉపన్యాసం" చేయడానికి , కరీంనగర్ జిల్లా ధర్మపురి నుండి డా. సంగనభట్ల నరసయ్య ముఖ్య ఉపన్యాసకులుగా వచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 1954 నుండి తెలుగు విభాగం గొప్ప ఆచార్యులతో విలసిల్లడం , వారు రాసిన పుస్తకాలు తెలుగు చదివే వారికి కర దీపికలు కావడం తనకు తెలుసునని అన్నారు. సంగనభట్ల "ఆముక్తమాల్యద వైశిష్ట్యం" పై మాట్లాడుతూ ప్రపంచంలో శ్రీకష్ణదేవరాయల వంటి చక్రవర్తి లేరని, ఏ రాజు గొప్ప కవిగా రాణించలేదని అన్నారు. రాయలు అచ్చంగా తెలుగు వాడని, కన్నడీకుడు కాదని, వారు జీవిత కాలమంతా శోధించి, ప్రజాజీవితాన్ని, కవిత్వ సారాన్ని తన ఆముక్తమాల్యదలో ఇమిడ్చి ప్రౌఢ ప్రబంధంగా రాశారని అన్నారు. రాయలు ఆరు సంస్కృత గ్రంథాలు రాసిన విషయం చాలామందికి తెలియదని, వారి జాంబవతీ పరిణయం చదవమని చెప్పారు. రైతులు , వ్యాపారులు, ఆటవీప్రాంత వాసుల జీవితం ఆముక్తమాల్యదలో వుందని, దానిని లోతుగా చూడమన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన శాఖాధ్యక్షులు ఆచార్య రాజేశ్వరమ్మ ముఖ్యవక్త పాండిత్యాన్ని, పరిశోధనల తత్త్వాన్ని వివరించగా, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి ధర్మనిధి ఉపన్యాసం నేపథ్యాన్ని వివరించారు. ఆదిశేషయ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించగా, అశోక్ వందన సమర్పణ చేశాడు

ప్రమాదంలో సుందరీకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణానికి పడమటి దిక్కున ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర సువర్ణముఖి నదికి పడమర వైపున సుందరీకరణ పేరుతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపేయడం వల్ల ప్రమాదం పొంచి ఉందంటూ భయాందోళన వ్యక్తం చేశారు. సుమారు పది కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో అట్టహాసంగా ప్రారంభించిన సువర్ణముఖి నది సుందరీకరణ పనులు కాస్తా ప్రమాదాలకు కారణమవుతుంటే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమైన విషయమని నాయకులు విమర్శించారు. గురువారం టీడీపీ నాయకులు కరకట్ట సుందరీకరణ పనులను పరిశీలించారు. .అటు పురపాలక శాఖ, తుడా, పోలీసు శాఖ కానీ, ఇటు ఇరిగేషన్ శాఖ వారు గానీ ప్రమాదకరంగా మారిన అసంపూర్తి నిర్మాణాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధ్యతారాహిత్య చర్యగా అభివర్ణించారు. ప్రైవేటు సెక్యూరిటీగా విధులు నిర్వహించే ఒక వ్యక్తి సాయంత్రం వేళ సేద తీరడానికి సువర్ణముఖి నదికి పడమర వైపున నిర్మిస్తున్న కరకట్ట అంచులో కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తూ జారి నదిలో పడిపోయి స్వల్పంగా గాయపడిన ఇందుకు నిదర్శనమన్నారు. కరకట్ట పై వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ హోదాను మార్పు చేస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంటాక్ట్ అని ఇవ్వాలని కోరుతూ శ్రీనివాస ఆడిటోరియం నుంచి పరిపాలన భవనం మీదుగా ర్యాలీగా వెళ్లి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష , ఉపాధ్యక్ష కార్యదర్శులు కల్లూరు కిషోర్ రెడ్డి, ఐఎస్ కిషోర్, ఆనంద అమతరాజ్ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని ముట్టడి సందర్భంగా ఆచార్య హేమచంద్ర రెడ్డి 110 జీవో అమలు బాధ్యత వర్సిటీ ఉపకులపతులపై ఉందని స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్రంలో దాదాపుగా అన్నీ విశ్వవిద్యాలయాలు 110 జీవో అమలు చేస్తుండగా ఎస్వీ యూనివర్సిటీలో మాత్రం కనీసం అకడమిక్ కన్సల్టెంట్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంటాక్ట్ గా మార్చి అమలు చేసేందుకు అధికారులు సానుకూలంగా స్పందించకపోవడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో అన్ని విధాలుగా (ఒప్పంద అధ్యాపకులు) అకడమిక్ కన్సల్టెంట్ లు వర్సిటీ అభివద్ధికి కషి చేస్తున్నారన్నారు. నాక్ కమిటీ వర్సిటీ సందర్శించినప్పుడు కూడా అన్ని రకాల పనులను అకడమిక్ కన్సల్టెంట్ లతో చేయించుకున్నారన్నారు. నాక్ కమిటీ లో ఉన్నత ర్యాంకు రాగానే మీకు 110 జీవో అమలు చేస్తామని అధికారుల హామీల గుప్పించి ఇప్పుడు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ కళాశాలలో పనిచేసే వ్యక్తులు పిజి క్వాలిఫికేషన్ తోనే 58వేలు, 68వేలు కాంట్రాక్ట్ లెక్చరర్‌గా 12 నెలల రెన్యువల్ ఆర్డర్ ను తీసుకుంటున్నారన్నారు. కానీ యూనివర్సిటీలో పీహెచ్డీ చేసి సబ్జెక్టులో ప్రత్యేకమైన నైపుణ్యం సాధించి ఎంతోమంది విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్ గా తయారు చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ లకు పూర్తిగా న్యాయం చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకెళ్లి ఉన్నత విద్యా మండలి ముట్టడికి వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ రెడ్డీ, ముఖరాజు కుమార్ రాజు, శివశంకర్ రాయల్, దాము యాదవ్, శివప్రసాద్, మల్లీశ్వరి, సునీత పాల్గొన్నారు.

తుమ్మపూడి కోటేశ్వరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆచార్యుడిగా పనిచేసి , అనంతరం యస్వీయూ పిజి సెంటర్‌లో పదవీవిరమణ చేసిన ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు మృతికి యస్వీయూ అధికారులు ఆచార్య రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆచార్య తుమ్మపూడి వారు మంచి అధ్యాపకులని, ప్రాచీన సాహిత్యంలో లోతైన విమర్శకులని, కుమార భారతి బిరుదాంకితులని, ఆముక్తమాల్యదపై పరిశోధన చేసిన ఉద్దండ పండితులని, హరివంశంపై గొప్ప పరిశోధన చేశారని ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు డా. పి.సి వెంకటేశ్వర్లు అన్నారు. గత నెలలో వారిసాహిత్యంపై వారం పాటు ఆన్ లైన్ లో కొందరు వక్తలు ఉపన్యాసం చేసినపుడు తను ఎంతో ఆనందించాడని గుర్తుచేశాడు. వారి మతిపట్ల యస్వీయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ప్రతాప్ రెడ్డి, మాజీ ఓ ఆర్ ఐ సంచాలకులు ఆచార్య వెంకటరమణారెడ్డి, తెలుగు విభాగానికి చెందిన ఆచార్య పేటశ్రీ, ఆచార్య రాజేశ్వరమ్మ సంతాపాన్ని ప్రకటించారు.

ఆచార్య జయశంకర్‌కు అభినందన

క్యాంపస్ :శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ,ఫిజిక్స్ విభాగం విశ్రాంతాచార్యులైన డా. సికె. జయశంకర్ "బెస్ట్ రేర్ ఎర్త్స్ ఔట్రీచ్ అవార్డ్" కు ఎంపికయ్యారు.ఆయన చేసిన కషికి రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపునిచ్చింది. ఈనెల 17న గోవాలో ఇంధన భద్రత కోసం జరిగిన అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో ఈ అవార్డును అందుకున్నారు. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె రాజారెడ్డి , రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, ఫిజిక్స్ హెడ్ ఆచార్య విజయలక్ష్మి, ఆచార్య దేవప్రసాద్ రాజు పాల్గొన్నారు.

అమ్మ భాష...మాతృభాష

పుత్తూరు టౌన్: గిడుగు వారి 160 జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం యస్.వి పురం నందు జానపద సాహిత్యంపై గేయాల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశం మాట్లాడుతూ పిల్లలు మాతృభాషపై అభిలాష పెంచుకోవాలని, గెలుపొందిన వారికి 29వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు ఎవి రంగయ్య పాల్గొన్నారు. పరభాష మోజులో పడి మాతృభాషను మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శనం, నరసింహారెడ్డి, సూర్యప్రకాష్, కోమల పాల్గొన్నారు.

పేదల స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

పేదల స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో చంద్రముని హెచ్చరించారు. ఇందిరానగర్ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రహరీగోడ నిర్మాణంతో దారి సమస్యపై ఆర్డీవో విచారణ జరిపారు. ప్రజా సౌకర్యార్థం ఎంపిడిఒ కార్యాలయం మీదుగా వెళ్లే దారిని కల్పించేలా ప్రహరీ గోడ నిర్మించాలని ఆదేశించారు. గోపాలరావు కాలనీలో భూభాగోతంపై నిగ్గు తేల్చి, పేదల పట్టాలను ఆక్రమించే కబ్జాదారులపై క్రిమినల్‌కేసులు పెడతామన్నారు. ఇంటి స్థలాలు ఆక్రమణ, అమ్మకాలతో మోసం చేస్తున్న అక్రమాలపై నిగ్గు తేల్చాలని తహశీల్దార్ గౌరీశంకర్‌ను ఆదేశించారు. భూ అక్రమాలపై రెవెన్యూ రికార్డుల మార్పులను సిసిఆర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తి త్యాగరాజు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ నాగేంద్ర, సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలో నటుడు సుమన్

క్యాంపస్ : గోమాత పాదయాత్ర అనంతరం ప్రముఖ సిని నటుడు తల్వార్ సుమన్ నగరంలోని హరే రామ హరే కష్ణ దేవాలయం ఇస్కాన్ ను దర్శించుకున్నారు. మందిర కార్యదర్శి లీలా పారాయణ దాస్ వారికి స్వాగతం పలికి దేవుని తీర్థ ప్రసాదాలు, భగవద్గీత పుస్తకాలు అందజేశారు. సుమన్ మాట్లాడుతూ నగరంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్ ను మొదటిసారి దర్శించుకోవడం చాలా ఆనందదాయకమన్నారు. వీరి వెంట భాస్కర్ యాదవ్, డాక్టర్ నారాయణ గౌడ్, నాగవర్ధన్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

బస్సు జాతా ముగింపుసభను జయప్రదం చేయండి : సిపిఐ

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని నారాయణపురం పంచాయతీ ముళ్ళపూడి ఎస్టి కాలనీలో సిపిఐ మండల కార్యదర్శి మించల శివకుమార్ ఆధ్వర్యంలో బస్సు జాతా కరపత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం తిరుపతిలో జరగనున్న బస్సు జాతా ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్రపాకు శ్రీనివాసులు, బత్తెమ్మ, ఈశ్వరమ్మ, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

ముదిరాజులను ఐక్యం చేయాలి

రేణిగుంట : ముదిరాజుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం గురువారం రేణిగుంట మండలంలోని గాజులమండ్యం కురకాల్వ, కరకంబాడి దొడ్లమెట్ట బీసీ కాలనీలో గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ముదిరాజ్ సంఘ అధ్యక్షులు వల్లమ కన్నయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట రమణయ్య, గౌరవ అధ్యక్షులు పిల్లారి బత్తినయ్య మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులందరినీ ఐక్యం చేసి వారి సంక్షేమం అభివద్ధి ధ్యేయంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ పలకరింపుకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు. ముదిరాజులు 20వేల పైచిలుకు ఉన్నా రాజకీయంగా సరైన గుర్తింపు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుజాత, గంగారి రమేష్, తోటకూర కోటేశ్వరరావు, బొజ్జ గోవిందస్వామి, గురుమూర్తి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ వైద్యం ఎంతో విలువైనది : కె.కుప్పయ్యశెట్టి

పుత్తూరు టౌన్ : ఫిజియోథెరపీ వైద్యం ఎంతో విలువైనదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కెకెసి కళాశాల ఛైర్మన్ కె.కుప్పయ్యశెట్టి పేర్కొన్నారు. కెకెసి కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ స్నాతకోత్సవ మందిరంలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ అవసరం లేని వ్యాధి అంటూ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ నరసింహ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లో మాజీ సర్పంచ్‌పై దాడి

ప్రజాశక్తి -తొట్టంబేడు

మండలంలోని గుండేలగుంట పంచాయతీ ఇరుపాక్షపురం ఇసుక రీచ్ నుండి ఇసుక ట్రాక్టర్లను నడుపుతున్నటువంటి తాళ్లూరు.విజయ బాబు, ఆయన కుమారులు మునివెంకయ్య, ఉదయ్ కుమార్ అను ముగ్గురు కలసి ఇసుక ట్రాక్టర్లును ఇసుక రీచ్ లో పెట్టి ఇసుకను రవాణా చేస్తూ ఉండేవారు. అయితే రీచ్ నుండి రవాణా చేయుటకు స్వర్ణముఖి నది మధ్యలో సుమారు మూడు కిలోమీటర్ల మేర పెద్ద రహదారి నిర్మించి

తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు

ఇందులో ఇసుక రవాణా పూడి,పెన్నలపాడు ఆర్ అండ్ బి రహదారి మీదగా ఇసుక రవాణా జరుపుతుంటారు. అయితే ఈ రోడ్డు పై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో మాజీ సర్పంచ్ తాళ్లూరు.విజేత పొలం నది ఒడ్డున ఉండడంతో ప్రోక్లైన్ల సహాయంతో ఇసుక రీచ్ నడుపుతున్నటువంటి వారు, తాళ్లూరి వెంకయ్య,ఉదయ్ కుమార్ వాళ్ళు కలిసి విజేత పొలానికి ఆనుకుని ఉన్నటువంటి రాళ్ల గుట్ట నుంచి కంకర రాళ్ళను తరలిస్తుంటే విజేత భర్త తాళ్లూరు.హరియాదవ్ అడ్డుకున్నాడు. అక్కడ మాటామంతి పెరిగి ఇరు గ్రూపులు ఘర్షణ పడ్డారు.అయితే అక్కడితో ఆగకుండా విజయ్ బాబు కుమారులు అయినటువంటి ముని వెంకయ్య,ఉదయ్ కుమార్ లు ఇద్దరు కలిసి

గాయపడిన విజేత

హరియాదవ్ భార్య విజేతను కర్రతో బలంగా కొట్టారు. ఆమెకు తలపై బలంగా దెబ్బ తగిలింది. ఆమెకు శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ లో ఐదు కుట్లు వేశారు. చేతులతో, కాళ్లతో ఆమె భర్తను కొట్టారు. ఈ విషయమై తొట్టంబేడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. వాళ్ళను చికిత్స నిమిత్తం తిరుపతి ఏరియా హాస్పిటల్ లో చికిత్స తీసుకొని వెళ్ళారు. బాధ్యులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

తిరుపతి పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

దేశంలోని ఇతర నగరాల కన్నా సుందరంగా ఆదర్శ వంతమైన పారిశుధ్య నగరంగా తిరుపతి నగరాన్ని తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ కషి చేస్తోందని టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొత్తగా కొనుగోలు చేసిన 12 ట్రాక్టర్లను టీటీడి ఛైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తోందని, నగరంలో నివాసం వుండాలనే ప్రజల సంఖ్య రోజు రోజుకి పెరుగుతోందని, దానికి అనుగుణంగా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదం రాధాకష్ణ రెడ్డి, బోకం అనీల్ కుమార్, తిరుపతి మునిరామిరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాపా నాయుడు పేట వైద్యాధికారులు డాక్టర్ శిల్ప, డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఎనిమిది మంది క్షయ వ్యాధిగ్రస్తులకు అత్యంత పోషక విలువలు గల ఆహార పదార్థాలను గురువారం పంపిణీ చేశారు. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ వీటిని సమకూర్చి పంపిణీ చేయాలని కోరింది. క్షయ వ్యాధిగ్రస్తులకు ఈ వ్యాధి ముఖ్యంగా ప్రోటీన్ లోపం వల్ల వస్తుందని, అందువలన అత్యధికంగా పోషక విలువ కలిగిన ఆహార పదార్థములను

అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ అన్నపూర్ణ, ఆరోగ్యపరివేక్షకులు సుబ్రహ్మణ్యం, మంజుల, ఫార్మసిస్ట్ నాగభూషణం, ఉషారాణి, నిర్మల ఆరోగ్య కార్యకర్తలు శోభారాణి పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో 'సిటిజన్ ఔట్ రీచ్ క్యాంప్'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈ నెల 25, 26 వ తేదీలలో నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించే సిటిజెన్ ఔట్ రీచ్ క్యాంప్ లో అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చుటకు "సిటిజన్ ఔట్ రిచ్ క్యాంపెయిన్" కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25, 26 తేదీల్లో శుక్ర, శని వారాల్లో వార్డు సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు, నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు వార్డు సచివాలయ పరిధిని పరిగణలోనికి తీసుకుని ప్రతి క్లస్టర్ నందు 50 ఇండ్లకు ఒక్క టీం గా ఏర్పాటు చేశామని అన్నారు. వీరు ప్రతి ఇంటికి ఆధార్ సర్వీసుల పైన అవగాహన, మున్సిపల్ సర్వీసుల పై అవగాహన వెల్ఫేర్ క్యాలెండర్, సచివాలయం సెక్రటరీ ఫోన్ నెంబర్లు వివరములు,మీసేవ, నాన్ మీసేవ సర్వీసెస్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

పౌష్టికాహార తోటల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్

ప్రభుత్వ సంస్థల్లో పౌష్టికాహార తోటలను పెంచడానికి కషి విజ్ఞాన కేంద్రం విత్తనాలు అందిస్తుందని కషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ గోవిందరాజులు గురువారం కెవికెలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మనం తినే ఆహారాన్ని సేంద్రియ ఎరువులతో పండించే తోటల నుండి వచ్చిన పౌష్టికాహార కూరగాయలను ఆకుకూరలను తినాలని అన్నారు. కషి విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రభుత్వ పాఠశాలకు, అంగన్వాడి కేంద్రాలకు, వివిధ ప్రభుత్వ రంగసంస్థలకు శిక్షణతో పాటు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. గహ విజ్ఞాన శాస్త్రవేత్త బి విజయ శ్రీ మాట్లాడుతూ పౌష్టికాహార తోటలను గహస్థాయిలోనే కాకుండా వివిధ సంస్థల్లో కూడా పెంచుకుంటూ సూక్ష్మ పౌష్టికాహార లోపాన్ని, గర్భిణి మహిళలులో చిన్న పిల్లలు తగ్గించుకోవచ్చని ఈ తోటల ద్వారా పండే కూరగాయలు పండ్లు ఆకుకూరలు తినడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ డీ తిరుపాలు, డాక్టర్ పి నాగార్జున రెడ్డి, రాజీవన, ఏపీ ఎస్పీ బెటాలియన్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో రూ.150 కోట్ల లావాదేవీలు

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్

యూనియన్ బ్యాంక్ శాఖ 50 కోట్లరూపాయల వ్యాపార వావాదేవీలు జరపటం హర్షనీయమని ప్రాంతీయ అధికారి రామ్ ప్రసాద్ తెలిపారు. పుత్తూరు పట్టణంలోని ఈశ్వర గుడి వీధిలో ఆ శాఖ కార్యాలయంలో గురువారం ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆభరణ రుణాలు 50 కోట్లు వినియోగదారులకు మంజూరు చేసినట్లు తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఈశ్వరాలయం ప్రహరీ గోడ కు మొక్కలు నాటామని తెలిపారు. స్థానిక సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ అశోక్ రాజ్ తో పాటు, ఖాతాదారులు, బ్రాంచ్ సాధించిన వ్యాపార విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కళ్యాణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఓజిలి

సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి , ఎంపీడీవో వీ.రజినీకాంత్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించి, ప్లాస్టిక్‌రహిత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరువయ్యేలా చొరవ తీసుకోవాలని అధికారులకు ,ప్రజాప్రతినిధులకు తెలియజేశారు.సర్వసభ సమావేశానికి హాజరైన వివిధ శాఖ అధికారులు సంక్షేమ పథకాల గురించి వివరించారు. కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల సమస్యలను సర్వసభ్య సమావేశ దష్టికి తీసుకుని వెళ్ళగా సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించారు.

రాజయోగ ఆశ్రమానికి సిమెంటు బస్తాలు విరాళం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్

మండలంలోని ఎగువ గొల్లపల్లి గ్రామంలో ఉన్న అచల పరిపూర్ణ రాజయోగ ఆశ్రమం ప్రహరీ గోడ నిర్మాణానికి రాచగున్నెరి పంచాయతీ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు సిమెంటు బస్తాలను విరాళంగా అందజేసి ఆయన తన దాతత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ ఎవరికి ఎప్పుడు ఎటువంటి కష్టం వచ్చినా తానున్నానంటూ ముందుగా వచ్చే మంచి వ్యక్తిత్వం గల వ్యక్తి జగన్నాథం నాయుడు అని అన్నారు. అలాగే ఆశ్రమ ప్రహరీ గోడ నిర్మాణానికి సిమెంటు బస్తాలను విరాళంగా అందజేసినందుకు ఆయనకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని జగన్నాథం నాయుడు అనుచరులు, జగరాజుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమలకు వచ్చే భక్తులకు నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించే దిశగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ ఎస్ ఎస్ ఎఐ) పలు చర్యలు తీసుకోనుంది. ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆధ్వర్యంలో తిరుపతిలోని తాజ్ హోటల్ లో గురువారం 41వ సెంట్రల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈవో ధర్మారెడ్డి పిలుపు మేరకు ఎఫ్ ఎస్ ఎస్ ఎఐ అధికారులు తిరుమలను సందర్శించారు. తిరుమల లో ఆహార నాణ్యత, అన్న ప్రసాదం , లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రం, నీటి సరఫరా తదితర అంశాల నిర్వహణను మరింత మెరుగు పర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎఫ్ ఎస్ ఎస్ ఐ సిఇవో జి.కమలవర్ధనరావు , ఏపీ ఫుడ్ సేఫ్టీ కమీషనర్ జె.నివాస్ , ఇతర అధికారులు టిటిడి ఈవోతో చర్చించారు. తిరుపతి లో అత్యాధునిక ఆహార నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ను ఏర్పాటు చేసేందుకు సుముఖత ను వ్యక్తం చేశారు. అలాగే భక్తులకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు టిటిడి సహకారంతో హోటళ్ల నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, టిటిడి కలిసికట్టుగా పని చేసి భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోనున్నారు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 350/2022

సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ...వాది

Vs

షేక్ రహీమున్నీసా ...ప్రతివాది

టు

షేక్ రహీమున్నీసా
భర్త బాబు
ఏరూరు గ్రామం, చిల్లకూరు మండలం.

దావా నోటీసు

పై దావాలో వాది మీ దగ్గర నుంచి ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం రు.5,60,000/- పై కోర్టు నందు కేసు వేసి వున్నారు.మీకు నోటీసు నిమిత్తం తేది. 26-09-2023 కు వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు గానీ, మీ తరపు న్యాయవాది గానీ మీకు ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ముందు హాజరై అభ్యంతరము తెలుపుకోవలసినది. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానము చేయుదురని ఇందు మూలంగా తెలియ జేయడమైనది.

పి.వి.సాయి కుమార్ రెడ్డి
వాది తరపు న్యాయవాది

లక్ష్మికి మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

తిరుపతి టౌన్ : భవన నిర్మాణ పనుల్లో తీవ్ర గాయాలపాలైన ఒరిస్సా ప్రాంతానికి చెందిన వలస కార్మికురాలు లక్ష్మికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వేణు, సిపిఎం నగర ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. పదిరోజుల కిందట దేవా అనే కాంట్రాక్టర్ ఆమెను పనిలో పెట్టుకుని పనిచేయిస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయిందన్నారు. లక్ష్మికి తలలో 13 కుట్లు పడ్డాయని, కాలు ఎముక చిట్లిపోయిందని, మూడు పళ్లు విరిగాయని, కాలు తీసి బయట అడుగు వేయలేని స్థితిలో ఉందన్నారు. కాంట్రాక్టర్ ప్రాథమికంగా ఆస్పత్రిలో చూయించి గాలికి వదిలేశాడన్నారు. 1979 వలస కార్మిక చట్టం ప్రకారం పని ప్రదేశంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా కాంట్రాక్టర్‌దే బాధ్యతని, ఆమెకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆమె కోలుకునేవరకూ జీవనానికి అవసరమయ్యే ఖర్చు భరించాలని డిమాండ్‌చేశారు. ఆ కుటుంబ బాధ్యత కాంట్రాక్టర్ పట్టించుకోని పక్షంలో లేబర్ యాక్ట్ ప్రకారం కాంట్రాక్టర్ దేవాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిచో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునిరాజా, శ్రీరాములు, నారాయణస్వామి పాల్గొన్నారు.

మీ నమ్మకం నెరవేరుస్తా : నేదురుమల్లి

బాలాయపల్లి : వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు నేదురుమల్లి కుటుంబం పైన పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లి రామకుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జయంపు సచివాల యం, పిగిలాం సచివాలయ పరిధిలోని పిగిలాం ఎస్టీ కాలనీ , జార్లపాడు, కొత్తపాలెం గ్రామాల్లో కార్యక్రమం జరిగింది. ఎంపీపీ గూడూరు బాస్కర్ రెడ్డి, జయంపు సహకారసంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి, వైయస్సార్ సిపి నాయకులు సర్వేపల్లి సురేష్ పాల్గొన్నారు.

ఆర్డీఓ కిరణ్ కుమార్ సేవలు ప్రజలకు వరం

గూడూరు రూరల్ : గూడూరు డివిజన్ ప్రజలకు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఒక వరమని కోట ఎంపీటీసీ, నియోజకవర్గ ముతవల్లీల కమిటీ అధ్యక్షులు షేక్. మొబీన్ బాష అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ముతవల్లీల కమిటీ సభ్యులతో కలిసి ఆర్డీఓ దష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. దీనికి ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు. అనంతరం మొబీన్ బాష స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడూరు రెండవ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, టిడ్కో గహాలలో సుమారు ఐదువందల కుటుంబాలకు నివశిస్తున్నారని, ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు రెండు కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆర్డీఓ దష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే ఇంద్రా నగర్ లో కొన్నేళ్లుగా అనుభవంలో ఉన్న షాదీమంజిల్ స్థలంలో బోరు వేయాలని కోరామన్నారు. ఆర్డీఓ వెంటనే స్పందించి బోరు వేయించేందుకు, స్మశాన వాటికకు స్థలం కేటాయించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కోట, వాకాడు మండల కేంద్రాల్లోనూ లక్షల రూపాయలు ఖర్చు చేసి హిందూ, ముస్లిం, క్రైస్తవులకు స్మశాన వాటికలను నిర్మిస్తున్నారన్నారు. ఎటువంటి క్లిష్ట సమస్యలనైనా ఆర్డీఓ దష్టికి తీసుకెళితే క్షణాల్లో పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ఆర్డీఓ గూడూరు డివిజన్ కు ఉండడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ముతవల్లీల కమిటీ సభ్యులు జీలానీబాష, సుబహాని, నజీర్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పరిసరాల్లో రహదారులు విస్తరించాలి : ఎంపి

తిరుపతి టౌన్ : తిరుపతి పార్లమెంట్ పరిధిలో పలు జాతీయ రహదారులను విస్తరించాలని, కొత్త రహదారులు నిర్మించాలని కోరుతూ కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నేరుగా కలిసి పలు లేఖలను అందజేశారు. తిరుపతి నగరం అంతర్జాతీయ స్థాయిలో దినదినాభివద్ధి చెందుతోందని అందుకు తగినట్లు రోడ్లను విస్తరించాలని విన్నవించారు. అదేవిధంగా తిరుపతి బస్టాండ్‌ను కూడా అభివద్ధి చేయాలని కోరారు. తిరుమలలోని స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కరకంబాడి నుంచి శ్రీ ఇంజనీరింగ్ కాలేజి మీదుగా బైపాస్‌ను నిర్మిస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీంతోపాటు దూరం తగ్గి, సమయం ఆదా అవుతుందన్నారు. పలు ప్రతిపాదనలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రాబోవు ఎన్నికల్లో మెజార్టీతో గెలిపించండి

పుత్తూరు టౌన్ : రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపుకు కృషి చేయాలని మంత్రి ఆర్‌కె రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసిపి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో వడమాలపేట మండలంలో వైసిపి నుంచి మెజార్టీ వచ్చిందని, మంత్రిగా పదవులు వచ్చాయని, రాబోవు 2024 ఎన్నికల్లోనూ మంచి మెజార్టీతో గెలిపించేందుకు ఐక్యమత్యంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నోటికొచ్చినట్లుగా వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి విజయలక్ష్మి, వైస్ ఎంపిపి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పాల్గొన్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి : సిపిఎం

నాయుడుపేట : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని సిపిఎం నాయకులు ఎస్.ముకుంద, ఎస్.మహేష్‌బాబు డిమాండ్‌చేశారు. గురువారం నాయుడుపేట సిఐటియు కార్యాలయంలో అధిక ధరలను వ్యతిరేకిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచేసిందని, విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.సుబ్రమణ్యం, కె.వేలు, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఘనమైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గూడూరు

I. P. NO. 15/ 2023

మేకల విజయమ్మ ....పిటిషనరు

Vs

1. షేక్ ఖాదర్ బాషా
2. తోట రత్నమ్మ
3. బానాల జ్యోతి వురఫ్ జ్యోతమ్మ
4. కుడుమల రవి ....రెస్పాడెంట్లు

నోటీసు

పై తెలిపిన కోర్టులో పై నెంబరు ఐ.పి లో పిటిషనర్‌ని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటిషన్ దాఖలు చేసి ఉన్నందున సదరు విషయమై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల పై తెల్పిన కోర్టులో పైనెంబరు పిటిషన్‌లో తేది. 29-08-2023 న ప్రత్యక్షంగా గాని, వకీలు ద్వారా గానీ తెలుపు కొనవలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.అట్లు కానియెడల మీ పరోక్షమున పై నెంబరు పిటిషను తీర్మానించబడునని ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు,
అల్లి విజయభాస్కర్ బి.యస్సీ, బి.ఎల్.,
పిటిషనరు తరపున న్యాయవాది, గూడూరు.

మహారాజశ్రీ ఘనమైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గూడూరు

I.P.NO. 13 / 2023

అల్లి చంద్రశేఖర్ ....పిటిషనరు

Vs

1. షేక్ షఫి
2. సయ్యద్ మొహిద్దీన్
3. ఐ.సి.ఐ.సి.ఐ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరు ....రెస్పాడెంట్లు

నోటీసు

పై తెలిపిన కోర్టులో పై నెంబరు ఐ.పి లో ఒకటవ రెస్పాండెంటుని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని పిటిషనరు కోరినందున సదరు విషయమై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల పై తెల్పిన కోర్టులో పైనెంబరు పిటిషన్ లో తేది. 28-08-2023 న ప్రత్యక్షంగా గాని, వకీలు ద్వారా గానీ తెలుపు కొనవలసినది. అట్ల కానియెడల మీ పరోక్షమున పై నెంబరు పిటిషను తీర్మానించబడునని ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు,
అల్లి విజయభాస్కర్ బి.యస్సీ, బి.ఎల్.,
పిటిషనరు తరపున న్యాయవాది, గూడూరు.